క్లుప్తంగా

నేడు ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే పర్యటన

ఇబ్రహీంపట్నం: మండలంలోని కొమటికొండాపూర్‌లో బుధవారం ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు పర్యటించనున్నట్లు ఎంపీపీ జాజాల భీమేశ్వరి మంగళవారం తెలిపారు. గ్రామంలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

శరన్నవరాత్రోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆర్డీవో తదితరులు

కోరుట్ల: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం వద్ద గల దుర్గాదేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రోత్సవాల కరపత్రాన్ని ఆర్డీవో రాజేశ్వర్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ పెండెం గణేష్, దుర్గాదేవాలయం నిర్వాహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉదయ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి ఉదయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని వర్షకొండలోని పల్లె దవాఖానాలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. శిబిరంలో 100 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచు దొంతుల శ్యామల, ఉపసర్పంచు లక్ష్మణ్, ఎంపీటీసీ పొనకంటి వెంకట్, పంచాయతీ కార్యదర్శి రాకేశ్, ఎంపీహెచ్‌ఎస్ ఉష, హెచ్‌పీ భవాని, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శివాజీ రైతు యువజన సంఘం కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

రాయికల్: శివాజీ రైతు యువజన సంఘం మండలం అధ్యక్షుడిగా కాలగిరి గంగారెడ్డి నియమితులయ్యారు. మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కురుమ మహిపాల్, కోశాధికారిగా కడపటి మోహన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ముచ్చర్ల రాజేందర్, బోడుగం రాజారాం, కుర్మ రాజారెడ్డి, పడిగల గంగారెడ్డి ఎన్నికయ్యారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి: ఐదు శాతం మధ్యంతర భృతిని వ్యతిరేకిస్తూ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పెరుగుతున్న నిత్యావసర ధరలను పరిగణనలోకి తీసుకుంటే ప్రభుత్వం ఇచ్చే ఐదు శాతం భృతి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. కనీసం 20శాతం పెంచి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో తులసీ ఆగమయ్య, సంగనభట్ల రవీందర్, తిరుక్కోవెల శ్యాంసుందర్, అంకతి లింగారెడ్డి, తాహెర్, మురళీ, రాజన్న, రాజేందర్, శివప్రసాద్, రమేశ్ తదితరులున్నారు.

5న రెడ్డిల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో సంఘం నాయకులు

మేడిపెల్లి: మేడిపల్లి, భీమారం మండలాల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని రెడ్డి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సమావేశమయ్యారు. మండలంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో సభ నిర్వహిస్తామని జిల్లాలోని అన్ని మండలాల నుంచి రెడ్డిలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సభలో పలు ప్రధాన సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా కేంద్రం.. గులాబీమయం



జగిత్యాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



సభకు హాజరైన జనం

- మంత్రి కేటీఆర్ సభకు తరలివచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు

జగిత్యాల: జిల్లాలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు మంత్రి కేటీఆర్ రాగా, జిల్లా కేంద్రం అంతా గులాబీమయంగా మారింది. కలెక్టరేట్ నుంచి నూతనంగా ఏర్పాటుచేసిన డీపీవో కార్యాలయం వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అలాగే నూకపల్లిలో డబుల్‌బెడ్‌రూంల వద్ద రోడ్డు పొడవునా స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని యావర్‌రోడ్ మొత్తం ఫ్లెక్సీలు, తోరణాలతో నిండిపోయింది. సభకు నియోజకవర్గంలోని ప్రజలతో పాటు, గృహలక్ష్మి, డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులు తరలివచ్చారు. మంత్రి వచ్చే వరకు కళాకారులు ఆటపాటలతో అలరించారు. డబుల్‌బెడ్‌రూం ప్రొసీడింగ్ కాపీలు తీసుకోవడానికి మినీస్టేడియంలో వార్డుల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. 48 వార్డుల ప్రజలు రావడంతో మినీస్టేడియం కిక్కిరిసిపోయింది.

మంత్రికి వీరతిలకం దిద్దిన జెడ్పీ చైర్‌పర్సన్



మంత్రి కేటీఆర్‌కు తిలకం పెడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు మంత్రి కేటీఆర్ మంగళవారం జగిత్యాలకు రాగా, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత వీరతిలకం దిద్ది స్వాగతం పలికారు. అనంతరం మంత్రితో జగిత్యాల, ధర్మపురిలో జరిగిన కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొన్నారు.

అవ్వా.. మంచిగా ఆదాయం సంపాదించుకోవాలే..

జగిత్యాలఅగ్రికల్చర్: 'అవ్వా.. మంచిగా మార్కెట్ నిర్మాణం చేసినం. కొనేటోళ్లు ఇక్కడికే వస్తరు. కూరగాయలు బాగా పండించి మంచి ఆదాయం సంపాదించుకోవాలే' అంటూ ఆకుకూరలు విక్రయించే ఓ మహిళతో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. జగిత్యాల మార్కెట్‌యార్డులో 2 ఎకరాల్లో రూ 4.50 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్‌ను మంత్రి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. మార్కెట్‌లో మూడు షెడ్లను కలియ తిరిగి, కూరగాయలు, పూలు, నాన్‌వెజ్ అమ్ముకునే వారితో మాట్లాడారు. సమీకృత మార్కెట్ వల్ల రైతులతో పాటు వినియోగదారులకు మంచి లాభం ఉంటుందని పేర్కొన్నారు.



ఆకుకూరలు విక్రయించే మహిళతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

500 ఇళ్లు కేటాయించండి

మల్యాల: మల్యాల మండలం నూకపల్లి శివారులో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో మల్యాల మండలానికి 500 ఇళ్లు కేటాయించాలని మంత్రి కేటీఆర్‌ను చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఇళ్లు కేటాయించేందుకు సానుకూలత వ్యక్తం చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి కేటీఆర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

సంజయ్ ముక్కుసూటి మనిషి..

జగిత్యాలజోన్: 'మీ ఎమ్మెల్యే సంజయన్న గురించి నా కంటే మీకే బాగా తెలుసు. ముక్కుసూటి మనిషి. అప్పుడప్పుడు కోపానికి వస్తడు. కానీ మంచోడే' అంటూ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై మంత్రి కేటీఆర్ పంచులు వేశారు. దీంతో మంత్రి మాట్లాడుతున్నంత సేపు పక్కనే నిలబడ్డ ఎమ్మెల్యే ముసిముసి నవ్వులు నవ్వుతూ కనిపించారు. ఎమ్మెల్యే గురించి మంత్రి మాటల్లో.. 'మీ సంజయన్నకు అప్పుడప్పుడు కోపం వస్తది. అవన్నీ మనస్సులో పెట్టుకోవద్దు. మంచోళ్లకు అప్పుడప్పుడు కోపం ఉంటది. తప్పు పట్టుకోవద్దు. మంచి మనిషి కాబట్టే సీఎం కేసీఆర్ టికెట్ ఇచ్చిండు.. మీరు గెలిపించిండ్రు. చాలా అభివృద్ధి చేసిండు. మళ్లీ రెండోసారి గెలిపిస్తే జగిత్యాలను మరింత అభివృద్ధి చేస్తడు' అంటూ మంత్రి మాట్లాడారు. ఎమ్మెల్యే గురించి మంత్రి మాట్లాడుతున్నంత సేపు సభకు వచ్చిన జనం ఈలలు, కేకలు వేశారు. ఈలలు, కేకలు వేసుడు కాదు 70 వేల మెజార్టీతో గెలిపించాలి అంటే.. లక్షతో గెలిపిస్తాం అంటూ చప్పట్లు కొట్టారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో పసుల నర్సయ్య, బొమ్మ శంకరమ్మ మృతిచెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆదుకుంటానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ వెంట కాంగ్రెస్ నాయకులు భూక్య సుందర్, కొండ్ర రాంచంద్రారెడ్డి, గోపు శ్రీధర్, ఆకుల రాజిరెడ్డి, పాంపర్తి రంజిత్, ఏలేటి ఆనందర్‌రెడ్డి, ఎండీ ఇమామ్, గడ్డం మహిపాల్‌రెడ్డి, పిట్టల శేఖర్, ఏలేటి సంజీవరెడ్డి, మేడిపల్లి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే లక్ష్మీదేవిపల్లి, ధర్మనాయక్ తండా గ్రామాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ సూచించారు. రెండు మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పనిచేయాలని సూచించారు.

అంబులెన్స్ సమకూర్చాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని పోతారం గ్రామానికి అంబులెన్స్‌ను సమకూర్చాలని ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధి, బీజేపీ నేత చెన్నమనేని వికాశ్‌రావుకు ఆ గ్రామసర్పంచ్ ధర్మపురి జలంధర్, గ్రామస్తులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. పోతారం గ్రామం మారుమూల ప్రాంతంలో ఉంటుందని, గ్రామస్తులకు అత్యవసర సమయాల్లో మంచి వైద్యం అందించడానికి అంబులెన్స్ ఉంటే బాగుంటుందని పేర్కొన్నారు. ప్రతిమ ఫౌండేషన్ ద్వారా అంబులెన్స్ సమకూర్చాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

కోరుట్లరూరల్: సహకార సంఘాల బలోపేతమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని చిన్నమెట్‌పల్లిలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన పీఏసీఎస్ కార్యాలయం, గోదాంను మంగళవారం ప్రారంభించారు. అలాగే పైడిమడుగులో రూ.30.95 లక్షల వ్యయంతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల సింగిల్‌విండో గోదాం, రూ.8.3 లక్షలతో నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించి, మోహన్‌రావుపేట గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించే ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్, సింగిల్ విండో చైర్మన్లు సింగిరెడ్డి నర్సారెడ్డి, బండి భూమయ్య, జగన్మోహన్‌రావు, సర్పంచులు నూతిపెల్లి గంగరాజు, దమ్మ భీమారెడ్డి, సరికెల్ల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సహకార సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

బస్‌స్టాప్ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం



శేఖర్‌కు స్వీట్ తినిపిస్తున్న సర్పంచ్

మల్యాల: స్థానిక మార్కండేయ ఆలయ సమీపంలో నిర్మిస్తున్న బస్‌స్టాప్ నిర్మాణానికి ముదిరాజ్ మండల యూత్ అధ్యక్షుడు దొంతరవేని శేఖర్ రూ.3 లక్షలు విరాళం అందజేశారు. ముదిరాజ్ సంఘ నాయకుల ఆధ్వర్యంలో సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్‌కు మంగళవారం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాతరాజు శ్రీనివాస్, గంగయ్య, బొజ్జా నర్సయ్య, కీసరి గణేశ్, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, నీలం రవి పాల్గొన్నారు.

కాస్తులో ఉన్నాం.. పట్టాలివ్వండి



తహసీల్ కార్యాలయం ఎదుట వినతిపత్రాలతో గిరిజనులు

- తహసీల్దార్‌కు గిరిజనుల వినతి

మల్లాపూర్: 'నలభై ఏళ్లుగా కాస్తులో ఉన్నాం.. పట్టాలు ఇవ్వండి సారూ'.. అంటూ బంజార తండా గిరిజనులు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. స్థానిక కనకసోమేశ్వర బంజార తండాకు చెందిన 44 మంది గిరిజనులు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వీర్‌సింగ్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామశివారులోని సర్వే నంబర్ 1,040/1/1/1లో ఉన్న భూమిని 40 ఏళ్లుగా సాగు చేస్తూ కాస్తులో ఉన్నామన్నారు. కాగా ఇటీవల 1,040లో ఉన్న భూమిని ప్రభుత్వ భూమిగా నిర్ధారణ చేసిన రెవెన్యూ అధికారులు ఆ భూమిలో ఇతరులేవరికి హక్కులు కల్పించవద్దని కోరారు. నిరుపేద బంజార తండా గిరిజనులకు భూపంపిణీ పథకం కింద పట్టాలు ఇవ్వాలని విన్నవించారు. అధికారులు స్పందించకుంటే తమకు పట్టాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బంజార తండావాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ఆశావర్కర్ల గోడు పట్టదా?



సంఘీభావం తెలుపుతున్న జువ్వాడి కృష్ణారావు



ధర్మపురి పోలీస్ స్టేషన్లో ఆశావర్కర్లు

మల్లాపూర్/రాయికల్/పెగడపల్లి/ధర్మపురి/కోరుట్ల: ఆశ వర్కర్ల గోడు ప్రభుత్వానికి పట్టదా అని ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలో ఆశ వర్కర్ల చేపట్టిన నిరవధిక సమ్మెకు మంగళవారం సంఘీభావం ప్రకటించారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేసి, రూ.18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రతతో పాటు న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రి కేటీఆర్‌ను అడ్డుకుంటామని హెచ్చరించడంతో ఆశా కార్యకర్తలను మంగళవారం రాయికల్‌లో ముందస్తుగా అరెస్ట్ చేసి ఠాణాకు తరలించారు. సుమలత, విజయలక్ష్మి, లత, మమత, ప్రశాంతి, వనిత ఉన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద అంగన్‌వాడీలు, ఆశాలు మానవహారంగా ఏర్పడి ఆందోళన చేపట్టారు. ధర్మపురిలో ఆశావర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కోరుట్లలో మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశాకార్యకర్తలను అరెస్టు చేసి కేటీఆర్ సభ అనంతరం వదిలిపెట్టారు. ఆశావర్కర్ల సమ్మెకు సీఐటీయూ నాయకులు కడకుంట్ల నాగరాజు, యెల్ల పోషన్న మద్దతు తెలిపారు. పద్మ, జ్యోతి, లక్ష్మి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



రేకులపల్లి నుంచి వెళ్తున్న నాయకులు

సారంగాపూర్: ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సభకు మంగళవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి ప్రజలు జగిత్యాలకు తరలివెళ్లారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలతో పాటు బైక్‌లపై నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీగా బయలుదేరారు.

ధర్మపురికి తరలివెళ్లిన బీఆర్‌ఎస్ శ్రేణులు

పెగడపల్లి: ధర్మపురి పట్టణంలో మంగళవారం బీఆర్‌ఎస్ నిర్వహించిన ప్రగతి నివేదన సభకు పెగడపల్లి నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని 23 గ్రామాల నుంచి సుమారు 4 వేల మంది కార్యకర్తలను తరలించినట్లు మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి వెంకన్న పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

మల్యాల: మంత్రి కేటీర్‌ను అడ్డుకుంటారనే నెపంతో పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నూకపల్లి గ్రామంలోని నిరుపేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని కోరేందుకు కూడా అనుమతి ఇవ్వకుండా ముందస్తుగా అరెస్టు చేశారని బీజేపీ నాయకులు ఆరోపించారు. అరెస్టయినవారిలో మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్, ప్రధాన కార్యదర్శి నులుగొండ సురేశ్, గాజుల మల్లేశం తదితరులున్నారు.



పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

పరామర్శ

పెగడపల్లి: మండలంలోని నక్కపల్లి, ఎల్లాపూర్ గ్రామాల్లో వివిధ కారణాలతో మృతిచెందిన పలువురి కుటుంబ సభ్యులను మంగళవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మల్లాపూర్: 25 ఏళ్ల క్రితం వారంతా విద్యార్థులు. 7వ తరగతి అనంతరం విడిపోయి మళ్లీ కలుసుకున్నారు. మండలంలోని కొత్తదాంరాజుపల్లి జెడ్పీ పాఠశాలలో 1997–98లో 7వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మంగళవారం అపూర్వ సమ్మేళనం జరుపుకున్నారు. తమను విద్యావంతులుగా తీర్చిదిద్దిన నాటి ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భూమన్న, ప్రతాప్, గణేశ్‌లను సన్మానించారు. సమ్మేళనానికి కృషి చేసిన మామిడాల నవీన్, వాసం నాగరాజు, క్యాతం రమేశ్, నిగ రవి, గడచంద శ్రీనివాస్‌ను సహచర విద్యార్థులు అభినందించారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అంగన్‌వాడీల అరెస్టు అప్రజాస్వామికం



కోరుట్ల: పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీ ఉద్యోగులు

మల్యాల/రాయికల్/కథలాపూర్/పెగడపల్లి/కోరుట్ల: అంగన్వాడీ టీచర్ల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు రజిత, కన్వీనర్ సులోచన అన్నారు. మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లను ఎక్కడిక్కడ అరెస్టు చేయడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాయికల్‌లో ఉమాదేవి, రజిత, సుమలత, సువర్ణ, వనిత, కథలాపూర్‌లో 9 మందిని అరెస్ట్ చేశారు. పెగడపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆందోళన చేశారు. కోరుట్లలో అంగన్‌వాడీలను అరెస్టు చేసి కేటీఆర్ సభ అనంతరం వదిలిపెట్టారు. అలాగే సమస్యలు పరిష్కరించాలని రాయికల్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. లావణ్య, రమాదేవి, మిట్టపల్లి పద్మ, రాధ, రమ, ఉమాదేవి, సుజాత, గోదావరి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

జనగర్జనకు తరలిన బీజేపీ నాయకులు

రాయికల్/సారంగాపూర్: నిజామాబాద్ జిల్లాలో మంగళవారం నిర్వహించిన జనగర్జన సభకు రాయికల్ మండలం నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల నుంచి వేలాది మంది కార్యకర్తలు సభకు వెళ్లారని పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, నియోజకవర్గ నాయకులు పడాల తిరుపతి తెలిపారు. అలాగే సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి అధ్యక్షులు ఎండబెట్ల వరుణ్‌కుమార్, మ్యాడ జనార్ధన్‌ల ఆధ్వర్యంలో నాయకులు బస్సుల్లో వెళ్లారు.



రాయికల్: సభకు వెళ్తున్న బీజేపీ శ్రేణులు